సాక్షి అనకాపల్లి

సోమవారం : 28 : ఆగస్టు : 2023




అరకు సెక్షన్‌లో తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం-అరకు సెక్షన్‌లో ఆదివారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

43 ఏళ్ల తర్వాత మళ్లీ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 8లో



ఇన్‌ఫ్లో నిల్.. అవుట్‌ఫ్లో ఫుల్!

తాండవ రిజర్వాయరులో నీటిమట్టం రోజు రోజుకీ తగ్గుతోంది. వర్షం కురవకపోవడంతో ఇన్‌ఫ్లో నీరు రావడం లేదు. 8లో

న్యూస్‌రీల్

దుర్గాదేవికి లక్ష గాజులతో అలంకరణ



నర్సీపట్నం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గ అమ్మవారిని ఆదివారం లక్ష గాజులతో అలంకరించారు. దుర్గాదేవిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వరాలిచ్చే తల్లికి ఆలయ అర్చకులు పూజలు ఘనంగా నిర్వహించారు.

జాబ్ మేళాలో 42 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

నర్సీపట్నం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రిషి కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42 మంది ఎంపికయ్యారు. ఈ మేళాను కళాశాల కరస్పాండెంట్ కోనా సతీష్ ప్రారంభించారు. అరబిందో, హెట్రో కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాకు 55 మంది హాజరు కాగా 42 మంది ఎంపికైనట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు భరత్, జగదీష్ తెలిపారు. ఎంపికైన వారికి విశాఖ స్కిల్‌హబ్‌లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.

భారీగా బ్లాక్ ఆయిల్ స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్లాక్ ఆయిల్ డ్రమ్ములతో కూడిన వ్యాన్

అచ్యుతాపురం(అనకాపల్లి): డీజిల్‌లో కల్తీ చేసేందుకు వినియోగిస్తున్న సుమారు 7,180 లీటర్ల వేస్ట్ సాల్వెంట్ ఆయిల్(బ్లాక్ ఆయిల్)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో వేస్ట్ ఆయిల్‌ను నిల్వ చేసి అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి దాడి చేశారు. 45 డ్రమ్ముల వేస్ట్ సాల్వెంట్ ఆయిల్‌తో కూడిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, వ్యాన్ డ్రైవర్‌తో పాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. సెజ్‌తో పాటు పలు కంపెనీల్లో ఉపయోగించగా మిగలిన వేస్ట్ సాల్వెంట్ ఆయిల్‌ను హరిపాలెం వద్ద నిల్వ చేస్తున్నట్టు గుర్తించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని సీఐ మురళీ రావు, ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు.

నేడు డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం (స్పందన)కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించే డయల్‌యువర్ మేయర్ కార్యక్రమంలో 1800 4250 0009 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం నిర్వహిస్తారు.

6 నుంచి స్కౌట్స్ జాతీయ ట్రెక్కింగ్

మద్దిలపాలెం(విశాఖ): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు జాతీయ ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని జోషిమత్, చమోలీలో 7 రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరోగ్యవంతులైన 15 నుంచి 25 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు 99081 86117లో సంప్రదించవచ్చు.

వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు పోస్టింగ్

- మరో ముగ్గురికి అటాచ్‌మెంట్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న ఆరుగురు సీఐల్లో ముగ్గురికి పోస్టింగ్ కల్పిస్తూ, మరోముగ్గురిని స్టేషన్లకు అటాచ్‌చేస్తూ డీఐజీ హరికృష్ణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న కె.కుమార్‌స్వామిని అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ వీఆర్‌కు,ఎస్.రామకృష్ణను శ్రీకాకుళం వీఆర్‌కు, ఎస్.వేణుగోపాలరావును మన్యం పార్వతీపురం జిల్లా వీఆర్‌కు అటాచ్ చేశారు. శీరా భాస్కర్‌రావుకు శ్రీకాకుళం దిశ పోలీస్‌స్టేషన్‌లో, పి.కోటేశ్వరరావుకు శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో సీఐలుగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్.కామేశ్వరరావుకు శ్రీకాకుళం జిల్లా గార పోలీస్టేషన్‌లో ట్రాఫిక్ సీఐగా పోస్టింగ్ కల్పించారు.

బతుకు బండికి భరోసా

- ఆటో డ్రైవర్లను ఆదుకుంటున్న వాహనమిత్ర
- జిల్లాలో తాజాగా 13,691 మంది లబ్ధిదారులకు రూ.13.60 కోట్ల మంజూరుకు చర్యలు
- 374 ఎండీయూ ఆపరేటర్లకూ పథకం వర్తింపు
- వరుసగా ఐదో ఏడాది అమలు చేయనున్న ప్రభుత్వం

బతుకు బండి లాగడానికి ఇబ్బంది పడుతున్న డ్రైవర్లకు భరోసా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర అనే పథకాన్ని అమలు చేస్తోంది. సొంత వాహనం కలిగిన ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, మరమ్మతులు, ఇతర అవసరాల నిమిత్తం ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తోంది. వరుసగా ఐదో ఏడాది అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.



ఆటోలతో వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారులు

తుమ్మపాల: వైఎస్సార్ వాహన మిత్ర పథకం డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. క్రమం తప్పకుండా ఏడాదికి రూ.10 వేల చొప్పున అందిస్తూ అండగా నిలుస్తోంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా ఆర్థిక సాయం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఇప్పటికే నాలుగు సార్లు అందించి, ఇప్పుడు ఐదో సారి అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాదితో మొత్తం ఒక్కో ఆటో, క్యాబ్ డ్రైవర్‌కు రూ.50 వేలు అందినట్టువుతుంది.

31న ఆర్థిక సాయం జమ

ఈ నెల 31న ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించే కార్యక్రమాన్ని జిల్లా పరిధిలోని కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, లబ్ధిదారులు వీక్షించనున్నారు. అనంతరం కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో డ్రైవర్లకు అందించనున్నారు. వలంటీర్లు గ్రామ స్థాయిలో వాహనదారుల ఈకేవైసీ ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశారు.

ఎండీయూ ఆపరేటర్లకూ..

రేషన్ సరకులను ఇంటి వద్దకే ఇవ్వడానికి ప్రభుత్వం రేషన్ వాహనాలను 2021 ఏడాది నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనాల ఆపరేటర్లకు కూడా వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని అందించాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారు. జిల్లాలో 374 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు వైఎస్సార్ వాహనమిత్రపథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున మొత్తం రూ.37.40 లక్షలు అందజేస్తోంది. వాహన ఆపరేటర్లకు రేషన్ సరకుల సరఫరా నిమిత్తం నెలకు రూ.18వేల చొప్పున చెల్లిస్తోంది.

అదనంగా 1,691 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 14,271 మంది ఆటో, క్యాబ్, ఎండీయూ డ్రైవర్లు వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేయగా.. 13,691 మందిని అర్హులుగా గుర్తించి, దరఖాస్తులను అప్రూవ్ చేశారు. వీరికి రూ.13.60 కోట్లు మంజూరు చేయనున్నారు. 580 దరఖాస్తులు వివిధ కారణాల(సాంకేతిక, వాహనాలు విక్రయించినవారు కూడా దరఖాస్తు చేయడం)తో రిజక్ట్ అయ్యాయి. గతేడాది దాదాపు 12 వేల మంది వాహనమిత్ర పథకంలో ఆర్థిక సాయం పొందారు. ఈ ఏడాది అదనంగా 1,691 దరఖాస్తులు అందాయి.

వాహనమిత్ర లబ్ధిదారుల వివరాలు

ఏడాది	లబ్ధిదారుల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
2019-20	10,517	10.51
2020-21	11,221	11.22
2021-22	10,774	10.77
2022-23	12,447	12.44
2023-24	13,691	13.60 (సుమారు)
మొత్తం ఐదు విడతల్లో సుమారు		58.54

అర్హులు 13,691 మంది



ఈ నెల 31న ఆటో, క్యాబ్ డ్రైవర్ల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్న వైఎస్సార్ వాహనమిత్ర నగదు రూ.10 వేలతో కలిపి మొత్తం ఐదేళ్లలో ఒక్కో డ్రైవరు రూ.50 వేలు లబ్ధిపొందుతున్నారు. ఈ ఏడాది ఎండీయూ ఆపరేటర్లకు కూడా రూ.10 వేలు అందిస్తున్నాం. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో మొత్తం 13,691 మందిని అర్హులుగా గుర్తించి కలెక్టర్‌కు నివేదిక పంపించాం. ఈనెల 31న లబ్ధిదారులకు నగదు జమ చేస్తారు.

– కె.వి.ప్రకాష్, జిల్లా రవాణా అధికారి, అనకాపల్లి

మూడేళ్లలో రూ.30 వేలు పొందా..



నేను ఆటో ద్వారా ఉపాధి పొందుతున్నాను.వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా అందించే రూ.10 వేలు మాకు చాలా ఉపయోగపడుతున్నాయి. మూడేళ్లలో రూ.30వేలు పొందాను గతంలో ఏ ప్రభుత్వం ఇలా మా ఆటో డ్రైవర్ల గురించి ఆలోచించలేదు. నేరుగా మా బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేయడం ఆనందంగా ఉంది.

– యన్నంశెట్టి శ్రీనివాస్, ఆటో డ్రైవర్, కుంచంగి

కష్టపడితే మనదే అధికారం



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, వేదికపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్



కార్యవర్గ సభ్యులతో మంత్రి అమర్‌నాథ్

- కార్యకర్తలను సమన్వయపరుచుకుంటూ నాయకులు పనిచేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారం చేపట్టే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను సమన్వయపరుచుకుంటూ పార్టీ నాయకులంతా పనిచేయాలన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత పార్టీ నూతన కార్యవర్గసభ్యులైన మీపై ఉందన్నారు. అనకాపల్లి టౌన్ రింగ్‌రోడ్డు దగ్గర గల మంత్రి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ అధినేత, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 55 మందితో నూతనకార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని, కీలకమైన సమయంలో ఈ కార్యవర్గం బాధ్యతలు తీసుకుందని చెప్పారు. ప్రజాసంకల్పయాత్రలో తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీపై గత ఎన్నికల్లో ప్రజలు ఎలా నమ్మకం పెట్టుకుని ఓట్లు వేశారో అదేరీతిలో రానున్న ఎన్నికల్లో కూడా రెట్టింపు నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. మనమంతా జగనన్న అభిమానులం..వైఎస్సార్‌సీపీ కుటుంబానికి చెందిన అన్నదమ్ముల్లాంటి వాళ్లం, కార్యకర్తలు, నాయకుల మధ్య ఏవైనా విభేదాలు ఉంటే.. వాటిని పక్కనపెట్టి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అధికారంలోకి వస్తే మరింతమంది కొత్త వారికి పదవులు లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పార్టీ విజయం కోసం పని చేసే వారిని గుర్తించి భవిష్యత్తులో కీలక పదవులు లభించేటట్టు చూస్తామని మంత్రి అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. వచ్చే కొద్ది నెలలు కష్టపడితే, ఐదేళ్లపాటు మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ కమిటీ ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, బగ్గు శ్యామల, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధి, కోశాధికారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లు పాల్గొన్నారు.

జై మత్స్యకార.. జై జగనన్న!

- 31న హార్బర్ వద్ద మత్స్యకార మహాసభ
- ఉత్తరాంధ్ర నుంచి భారీగా హాజరుకానున్న మత్స్యకారులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలకు కృతజ్ఞతలు తెలపనున్న నేతలు
- 2003 ఏప్రిల్‌లో విశాఖలో ఈ తరహా సదస్సు
- నాటి సభకు ప్రతిపక్ష నేతగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాజరు

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పడానికి మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 31న విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద రాష్ట్రంలోనే తొలిసారిగా మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 2003 ఏప్రిల్ 4న మత్స్యకారులు ఇలాంటి మహాసభనే విశాఖలో నిర్వహించారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ఆ మహాసభలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. సరిగ్గా ఇరవయ్యేళ్ల తర్వాత ఇప్పుడు 'జై మత్స్యకార.. జై జగనన్న' పేరిట మత్స్యకార మహాసభను నిర్వహిస్తున్నారు. 31 సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే ఈ మహాసభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మత్స్యకారులు, మత్స్యకార నేతలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకారుల బతుకులు ఎంతగానో మెరుగుపడ్డాయి. సముద్రంలో చేపలవేటపై రెండు నెలల పాటు నిషేధం అమలు సమయానికి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద వీరికి రూ.10 వేలు చెల్లిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ సొమ్ము రూ.4 వేలు మాత్రమే ఇచ్చేది. మత్స్యకార బీమా సొమ్మును రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో బోట్లకు సరఫరా చేసే డీజిల్‌పై లీటరుకు రూ.6 సబ్సిడీ ఇచ్చేది. అది కూడా ఆర్నెల్లు, ఏడాది తర్వాతో చెల్లించేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సబ్సిడీ సొమ్మును రూ.6 నుంచి 9కి పెంచడమే కాదు.. ముందుగానే మత్స్యకారుల ఖాతాలో రాయితీ మొత్తం జమ అవుతోంది. అంతేకాదు.. మునుపటి ప్రభుత్వంలా కాకుండా అన్ని మెకనైజ్డ్, మోటారు బోట్లకు ఈ రాయితీని వర్తింపజేస్తోంది. అలాగే రూ.152 కోట్ల వ్యయంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ జరుగుతోంది. ఇలా సంక్షేమ పథకాలే కాకుండా మత్స్యకారుల జీవితాలు బాగు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పది ఫిషింగ్ హార్బర్లు, ఏడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పోర్టులను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా వేల సంఖ్యలో మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

హాజరుకానున్న మత్స్యకార నేతలు

మహాసభకు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, తీరప్రాంత ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మత్స్యకార నేతలు హాజరు కానున్నారు. నాటి మత్స్యకార మహాసభలో వైఎస్‌తో పాటు మోపిదేవి, మల్లాడి కృష్ణారావులు పాల్గొనగా, 31న జరగబోయే మహాసభకు కూడా వీరిద్దరూ హాజరవుతుండడం విశేషం! ప్రజలకు, మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపడానికి, ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో ఈ మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నామని ఈ సభ నిర్వాహకుడు, రాష్ట్ర మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.

7 నుంచి నూకాంబిక ఆలయ పునఃనిర్మాణ పనులు

- వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పూర్తి
- ఆలయ ఈవో బండారు ప్రసాద్



నూతన ఆలయ నమూనాను ఆవిష్కరిస్తున్న ఈవో బండారు ప్రసాద్ ప్రసాద్, రేజేటి రామాచార్యులు, దాడి జయవీర్

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునః నిర్మాణ పనులను వచ్చే నెల 7వతేదీ నుంచి ప్రారంభిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలివిడతగా రూ.3.5 కోట్ల వ్యయంతో నూతన గర్భాలయం, అంతరాలయం, అనువెట్టిల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మలివిడతలో రూ.5 కోట్లతో ప్రాకారమండపం పనులు చేపడతామని చెప్పారు. టీటీడీ నుంచి రూ.1.5కోట్లు మంజూరయ్యాయని, వచ్చే ఏడాది నిర్వహించే కొత్త అమావాస్యజాతర నాటికి పనులు చేసి నూతన ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. నిర్మాణ సమయంలో అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావుతోపాటు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని తెలిపారు. గర్భాలయాన్ని రాతికట్టుతో నిర్మిస్తామన్నారు.

ప్రస్తుతం గర్భాలయం 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవు ఉందని, దీనిని 17.11 వెడల్పు, పొడవుతో నిర్మించనున్నామని చెప్పారు. 12, 14 వెడల్పు, పొడవుగల అంతరాలయాన్ని 17.11 అడుగుల పొడవు, 15.3 వెడల్పు చేస్తామన్నారు. 98 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్న ప్రాకారమండపాన్ని రాజగోపురంతో కలిపి 175 అడుగులు పొడవు, 93 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేలా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు మాట్లాడుతూ ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో శిల్పాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుత ఆలయాన్ని క్రమేపీ తొలగిస్తూ నియమ నిబంధనల మేరకు నూతన ఆలయ నిర్మాణ పనులు చేపడతామన్నారు. దేవాలయాన్ని మూడు భాగాలు విభజించి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్ మాట్లాడుతూ 800 ఏళ్ల చరిత్రగల అమ్మవారి దర్శన భాగ్యాన్ని, ఆశీస్సులను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆలయానికి వచ్చినప్పుడు ఆలయ అభివృద్ధికి టీటీడీ సహకారం కోరిన వెంటనే ఆయన రూ.1.5 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ప్రస్తుతం రూ.8.5 కోట్లతో పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.11 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఆలయ ముఖద్వారం 45 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అన్నదాన సత్రంతోపాటు 100 గదులకూడిన కల్యాణమండపాన్ని నిర్మిస్తామన్నారు. ఈ నిర్మాణ పనులకు ఎంపీ బి.వి.సత్యవతి ఎంపీ కోటా నుంచి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం ప్రసాదపథకంలో భాగంగా ఆలయ అభివృద్ధి నిధులు మంజూరుకు ఎంపీ సత్యవతి పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని త్వరలో దేవాలయ అధికారులతో కలవనున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణానికి అన్ని రాజకీయపార్టీలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆలయ పునః నిర్మాణం నమూనాను ఈవో ప్రసాద్, రేజేటి రామాచార్యులతోపాటు ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కింగ్స్‌దే కిరీటం

- ఏపీఎల్-2 విజేత రాయలసీమ కింగ్స్
- రన్నరప్‌గా కోస్టల్ రైడర్స్
- ముగిసిన ఏపీఎల్ రెండో సీజన్



రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమ విహారీని ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న సహచరులు

విశాఖ స్పోర్ట్స్: రాయలసీమ కింగ్స్ ఆటగాళ్లు అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్ కోస్టల్ రైడర్స్‌ను మట్టికరిపించారు. ఏపీఎల్ రెండో సీజన్‌లో చాంపియన్స్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించారు. పీఎం పాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఆదివారం రాయలసీమ కింగ్స్-కోస్టల్ రైడర్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారడంతో 18 ఓవర్లకు ఆట కుదించారు. తొలుత కోస్టల్ రైడర్స్ బ్యాటింగ్ చేయగా ఓపెనర్ ప్రణీత్(10) 38 పరుగుల వద్ద ఔటయ్యాడు. అతని స్థానంలో వచ్చిన కెప్టెన్ రషీద్ 12 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ ధరణీకుమార్ 30 పరుగుల వద్ద హనుమవిహారీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తొలి పది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. నాలుగో వికెట్‌కు హర్షవర్ధన్‌తో కలిసి చిరంజీవి(15) 50 పరుగుల భాగస్వామ్యాన్నందించారు. లేఖజ్‌రెడ్డి సైతం ఒక పరుగుతో పెవిలియన్‌కు చేరడంతో 15 ఓవర్లలో ఐదు వికెట్లకు 122 పరుగులే చేసింది. హర్షవర్ధన్(50) 5 ఫోర్లు 1 సిక్సర్‌తో అర్ధ సెంచరీ చేసి సాకేత్ బౌలింగ్‌లో వినయ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. చివర్లో 23 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది.

18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. కమరుద్దీన్ మూడు, హరిశంకర్ రెండు, వినయ్‌కుమార్, సాకేత్, హనుమ విహారీ ఒకో వికెట్ తీశారు. ప్రతిగా బ్యాటింగ్ దిగిన రాయలసీమ కింగ్స్ ఓపెనర్ వీరారెడ్డి డకౌట్ కాగా వంశీకృష్ణ 3 పరుగులతో వెనక్కి మళ్లాడు. మరో ఓపెనర్ సాయిశ్రావణ్ 24 పరుగులు చేశాడు. ఈ దశలో కెప్టెన్ హనుమ విహారీకి వినయ్‌కుమార్ తోడై నాలుగో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి పది ఓవర్లలో 97 పరుగులకు స్కోర్‌ను చేర్చారు. వినయ్‌కుమార్ 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 53 పరుగులతో వెనుతిరిగాడు. హనుమ విహారీ(46, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), గిరినాథ్‌రెడ్డి (28, 1ఫోర్ 3 సిక్సర్లు) అజేయంగా నిలిచారు. వీజేడీ పద్ధతిలో 18 ఓవర్లకు కుదించి 157 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించగా.. 16.3 ఓవర్లలో 160 పరుగులతో కింగ్స్ విజయాన్నందుకున్నారు. స్టీఫెన్, ఆశిష్ రెండేసి వికెట్లు తీయగా అబ్దుల్లా ఒక వికెట్ తీశాడు.

స్వయంభూ విఘ్నేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- నవరాత్రి సంబరాలకు ఘనంగా ఉత్సవ రాట



స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ రాట వేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉత్సవరాట వేశారు. ఈ కార్యక్రమంలో ధర్మశ్రీ పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే ఆలయంలో తూర్పు, ఉత్తర రాజగోపురాలను నిర్మించామని, పడమర రాజగోపురాన్ని కూడా త్వరలో నిర్మించడంతోపాటు మాడవీధులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయం బయట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు. ఈ ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాలు మరింత వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే నెల 18 నుంచి 26వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తామని ధర్మశ్రీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తి, ట్రస్టుబోర్డు చైర్మన్ ఉప్పల సతీష్, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వడ్డాది నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడొద్దు

- ఎంపీడీవో భవన నిర్మాణ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీపడకుండా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న స్థానిక ఎంపీడీవో భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ భవనానికి ఎదురుగా సువిశాల స్థలంలో చేపడుతున్న పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, సబ్బవరపు మాలిబాబు, వాలేటి నాగరాజు ఉన్నారు.

ఇన్‌ఫ్లో నిల్.. అవుట్‌ఫ్లో ఫుల్!

- రైతులను భయపెడుతున్న తాండవ నీటి నిల్వలు
- వర్షాభావంతో ప్రాజెక్టులోకి చేరని ఇన్‌ఫ్లో
- ఇదే పరిస్థితి కొనసాగితే శివారు ఆయకట్టుకు సాగు కష్టాలు



తగ్గుతున్న తాండవ ప్రాజెక్టులో నీటిమట్టం

నాతవరం: ఉమ్మడి జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరులో నీటిమట్టం రోజురోజుకీ తగ్గుతోంది. ఈ ఏడాది ఆశించిన విధంగా వర్షాలు కురవకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి మట్టం 366.0 అడుగుల మేర ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆయకట్టుకు ప్రాజెక్టు నుంచి సాగునీటిని ఈ నెల 10న ప్రధాన గేట్లు ఎత్తి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విడుదల చేశారు. ఆ సమయానికి ప్రాజెక్టులో నీటిమట్టం 371.0 అడుగులు ఉండేది. నీరు విడుదల చేసిన దగ్గర్నుంచి తాండవ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షం కురవకపోవడంతో ఇన్‌ఫ్లో నీరు రావడం లేదు. రోజూ అవుట్‌ఫ్లో 150 క్యూసెక్కుల మేర విడిచిపెడుతున్నారు. రిజర్వాయరు ప్రమాదస్థాయి నీటి మట్టం 380, డేడ్ స్టోరేజీ నీటి మట్టం 346 అడుగులుగా అధికారులు పరిగణిస్తారు. ఈ నీటిపై ఆధారపడి అనకాపల్లి జిల్లాలో నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, పాయకరావుపేట, కాకినాడ జిల్లాలో తుని, కోటనందూరు, రవతలపూడి మండలాల పరిధిలో 51.460 ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తుంటారు. రిజర్వాయరు ఏర్పాటు నుంచి ఇంతవరకు ఏటా అయకట్టుకు నీరు విడుదల చేసిన రోజు లేదా మరుసటి రోజు వర్షం కురిసేది. ఈ ఏడాది కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తాండవ ఆయకట్టు పరిధిలో ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురిసి నీటిమట్టం పెరిగితే తప్ప, ఇప్పుడున్న నీరు సరఫరా చేయలేమని అధికారులు చెబుతున్నారు. వరి పంట పండేంత వరకు నీరు సరఫరా చేయాలంటే నవంబరు నెలాఖరుకు ఇవ్వాలి. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు అక్టోబరు వరకే మాత్రమే ప్రవహించే అవకాశం ఉంది. ఈలోపు వర్షం పడి ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగితే రైతులు ఆశించిన విధంగా వరిపంటకు నీరు సరఫరా చేస్తామంటున్నారు. శివారు ఆయకట్టులో వరి పంట కంటే ఆరుతడి పంటలు వేసుకంటే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సాగునీరు పొదుపుగా వాడుకోవాలి



నాలుగేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా తగ్గింది. వర్షం పడి ఇన్‌ఫ్లో వచ్చి చేరితే నీరు సరఫరా చేస్తాం. దీనిని దృష్టిలో పెట్టుకోని ఆయకట్టు రైతులంతా చుక్క నీరు వృధా చేయకుండా వాడుకోవాలి. ఆయకట్టు పరిధిలో కాలువలపై మా సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వారికి రైతులంతా సహకరించాలి. పుష్కలంగా వర్షాలు పడితే ఎలాంటి సమస్య ఉండదు.

– జి.స్వామినాయుడు, డీఈ, తాండవ ప్రాజెక్టు

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- రూ.19.50 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు
- రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



రామభద్రపురంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా మండలంలోని రామభద్రపురం కాలనీలో రూ.10.30 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి మండలంలోని 32 పంచాయతీల్లో 101 గ్రామాల్లో సుమారు రూ.19.50 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నట్టు చెప్పారు. వీటిలో 48 పనులు ఇప్పటికే పూర్తి కాగా, మరో 12 పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. మరో 48 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. జగనన్న కాలనీల్లో కూడా నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు,పిసినికాడ ఎంపీటీసీ మొల్లేటి హైమ, సర్పంచ్ యల్లపు రమేష్,మొల్లేటి శివాజీ,మాజీ సర్పంచ్ రాము,బుద్ధ నాగేశ్వరరావు, శ్రీను, కోటి, పెద్దిశెట్టి రమేష్,ఎంపీడీవో కె.వి. నరసింహరావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, డీఆర్‌డీఏ ఏపీఎం కె.నీలాచలం,గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నికల్ కళాశాల మంజూరుపై హర్షం

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వెంకన్నపాలెం గ్రామస్తులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, విప్ ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వెంకన్నపాలెం గ్రామస్తులు, నాయకులు

చోడవరం: మండలంలోని వెంకన్నపాలెంలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం వారు గ్రామంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు. విప్ ధర్మశ్రీ ప్రతిపాదన మేరకు చోడవరం గవర్నమెంటు పాలిటెక్నికల్ కళాశాలకు సంబంధించి సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 9.80 కోట్లు తాజాగా మంజూరు చేసింది. దీని నిర్మాణానికి అవసరమైన ఆరెకరాల స్థలాన్ని చోడవరం మండలం వెంకన్నపాలెంలో సమకూర్చారు. దీంతో ఇక్కడ కాలేజీ భవనాల నిర్మాణం చేపట్టే పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. గతంలో ఏ ప్రభుత్వాలు తమ గ్రామాన్ని గుర్తించలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే ధర్మశ్రీ గుర్తించి ఇక్కడ కాలేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందని సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, స్థానిక నాయకులు నంబారు శ్రీనువాసరావు, జగదీశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పిల్లల గోవింద, వార్డు మెంబర్లు, డ్వాక్రా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువు శాస్త్రిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: ఎక్కడెక్కడో స్థిరపడి జీవనం సాగిస్తున్న వారంతా ఒక్కచోటకు చేరారు. 43 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకరికొకరు చూసుకున్న ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఈ అద్భుత దృశ్యం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కృతమైంది. ఆదివారం ఇక్కడ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం సందడిగా జరిగింది. ఇంటర్మీడియట్ నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయికతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. అప్పట్లో విద్యను బోధించిన శాస్త్రి, రమణ మాస్టార్లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అంతా ఒక చోట చేరటం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు



సింహగిరిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి, సభ్యులు, కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, అప్పన్న ఆలయంలో కేంద్రమంత్రి భగవంత్ ఖుభా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం కేంద్ర మంత్రి భగవంత్ ఖుభా, రూరల్ డవలప్‌మెంట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి కరుణానిధి, సభ్యులు, భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని త్రిమూర్తులు అందజేశారు. పీఆర్‌ఓ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దివ్య మృతిపై కేసు దర్యాప్తు

అనకాపల్లి టౌన్: స్థానిక దిశ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 14న ఆత్మహత్యకు యత్నించిన మళ్ల దివ్య విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు దిశ సీఐ టి.లక్ష్మి ఆదివారం చెప్పారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. 2022లో మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామానికి చెందిన దివ్య, అదే మండలం కించువానిపాలెం గ్రామానికి చెందిన కాయల మురళి ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి మధ్య విభేదాలు తలెత్తడంతో న్యాయం కోసం వచ్చిన ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విదితమే.

చంద్రయాన్-3లో మనోడు



పప్పల వెంకట ముత్యాలనాయుడు

కంచరపాలెం: ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా ఆనందిస్తుండగా.. ఈ మిషన్‌లో ఐటీఐ జంక్షన్ భవానీగార్డెన్స్‌కు చెందిన పప్పల వెంకట ముత్యాల నాయుడు తన వంతు పాత్ర పోషించడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోర్ట్ విశ్రాంత ఉద్యోగి పప్పల అప్పలనాయుడు, వెంకటరత్నం మొదటి కుమారుడైన ముత్యాల నాయుడు ఆంధ్రా యూనివర్సిటీలో బి.టెక్ పూర్తి చేశాడు. బిట్స్ పిలానీలో ఎం.టెక్ చదివాడు. సుమారు పదేళ్ల కిందట ఇస్రోలో చేరిన ముత్యాలనాయుడు ప్రస్తుతం తిరువనంతపురంలో పనిచేస్తున్నాడు. కాగా.. తమ కుమారుడు చంద్రయాన్-3 విజయంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని ముత్యాలనాయుడు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, త్రీస్టార్ వాకర్స్ సభ్యులు ముత్యాలనాయుడిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో స్విమ్మింగ్ కోచ్ మృతి



వాడమొదలు సతీష్ (ఫైల్)

తగరపువలస: బీచ్‌రోడ్డులో మార్లిన్ క్లే హోటల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వాడమొదలు సతీష్ (27) ఆదివారం మృతి చెందాడు. భీమిలి బోయవీధికి చెందిన సతీష్ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా బీచ్‌రోడ్డులో సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. తలకు, చేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం మధ్యాహ్నం ఆటోలో ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసును భీమిలి ఏఎస్ఐ జి.సత్తిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

కరాళ చందనం అరగదీత ప్రారంభం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం కరాళ చందనం అరగదీతని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈనెల 31న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సుమారు పది కిలోల కరాళ చందనాన్ని సమర్పిస్తారు. ఈ మేరకు కరాళ చందనం అరగదీతని చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

ఏయూలో గోపీచంద్ సినిమా షూటింగ్



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం వద్ద ఆదివారం గోపీచంద్ నటిస్తున్న సినిమా షూటింగ్ జరిగింది. వర్సిటీకి సెలవు కావడంతో విద్యార్థులు లేరు. దీంతో ప్రశాంత వాతావరణంలో షూటింగ్ జరిగింది. పాఠశాల విద్యార్థులతో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగం వద్ద సినిమా కోసం శ్రీ శారద విద్యా మందిర, చంద్రగిరి అంటూ బోర్డును అమర్చారు. స్థానిక ప్రజలు, కొంత మంది విద్యార్థులు షూటింగ్‌ను తిలకించారు.

పాఠశాలల్లో కుల, మత ప్రస్తావనలు వద్దు

విశాఖ విద్య: పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఇతర ఎలాంటి విద్యా సంస్థల్లోనైనా కుల, మత ప్రస్తావనలు తీసుకురావద్దని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పష్టం చేసింది. కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బాలల అభ్యున్నతి దృష్ట్యా రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలల్లో కుల, మత ప్రస్తావనలు తెచ్చే ఉపాధ్యాయులు, సిబ్బందిపై కమిషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో మతసామరస్యానికి విఘాతం కలిగిస్తున్నట్లు ఉపాధ్యాయులు, సిబ్బందిపై కమిషన్‌కు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇటువంటి వాటిపై కమిషన్ తీవ్రంగానే పరిగణిస్తుందన్నారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇటువంటి వాటిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైనట్‌లైతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గురువర్యా... చర్చిద్దాం రండి..!

- 30, 31 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- విద్యాకార్యక్రమాలపై అమలుపై విస్తృత సమీక్ష
- టీచింగ్, లెర్నింగ్ కేంద్రాలుగా సీఆర్‌సీలు బలోపేతం
- తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ సమావేశాలు



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు(ఫైల్)

విశాఖ విద్య : స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేసేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. విద్యార్థుల చదువులకు పాఠశాల స్థాయిలోనే పటిష్టమైన పునాదులు వేసేలా బోధనలో వినూత్నమైన పద్ధతులు అవలంబిస్తున్నందున, ఉపాధ్యాయుల భాగస్వామ్యం పెంచటం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే ఉద్దేశంతో కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేలా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ సమావేశాలు సైతం నిర్వహిస్తుండటం ద్వారా పాఠశాలల్లో క్రీడా విద్యకు పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు.

కాంప్లెక్స్‌ల నిర్వహణకు ప్రత్యేక నిధులు

జిల్లాలో 54 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఎంపిక చేసిన హైస్కూల్ కేంద్రంగా జరిగే కాంప్లెక్స్ సమావేశానికి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని సమీప పాఠశాలల నుంచి 40 నుంచి 50 మంది వరకు ఉపాధ్యాయులు హాజరవుతారు. ఉపాధ్యాయులకు శిక్షణ, బోధనోపకరణాల తయారీ కాంప్లెక్స్ కేంద్రాలుగానే జరుగుతాయి. కాంపెక్స్ చైర్మన్‌గా ఉన్న హెచ్‌ఎం పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీటి నిర్వహణకు ఏడాదికి రూ.25 వేలు ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేస్తుంది. కాంప్లెక్స్ స్థాయిలో ప్రతీ నెలా నిర్వహించే సమావేశాలకు ఈ నిధులను వినియోగించుకునేలా అవకాశం కల్పించారు.

సమీక్ష ఇలా..

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉదయం 9 నుంచి 5 గంటలకు వరకు జరుగుతుంది. వందేమాతరం గీతాన్ని ఉపాధ్యాయులంతా ఆలపించాలి. అనంతరం డీఈవో ఉపన్యాసం ఉంటుంది. 9.30కు ఎఫ్ఏ-1 పరీక్ష నిర్వహణపై సమీక్ష ఉంటుంది. బోధన పద్ధతుల్లో అవలంభించే వివిధ పద్ధతులు, వాటికి వినియోగించే బోధనోపకరణాలపై చర్చిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలు, రాబోయే నెలలో వాటిని మరింత విజయవంతంగా నిర్వహించటంలో అవలంభించిన అంశాలపై చర్చిస్తారు.

విద్యా కార్యక్రమాలపైనే చర్చ

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో కేవలం విద్యా సంబంధిత కార్యక్రమాలపైనే చర్చించాలి. ఉపాధ్యాయ సంఘాల సమావేశం, సర్వీసు పరమైన అంశాలు, బదిలీలు, పదోన్నతుల సన్మానాలు వంటివి నిర్వహించకూడదు. ఎటువంటి వ్యక్తిగతమైన కార్యక్రమాల దీనిలో చర్చించడానికి వీల్లేదని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు.

ఇలాంటి సమీక్షలు ఎంతో అవసరం



విద్యా కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కాంప్లెక్స్ సమావేశాలు కీలకంగా పనిచేస్తాయి. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులంతా ఒక చోట రోజంతా కూర్చొని చర్చించటం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతుంది.

– ఇమంది పైడిరాజు, అడవివరం కాంప్లెక్స్ చైర్మన్

విద్యాభివృద్ధికి దోహదం



కాంపెక్స్‌లను పటిష్టం చేయడం వల్ల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. కాంప్లెక్స్‌ల నిర్వహణ ఇప్పటి వరకు అస్తవ్యస్తంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని ఏమాత్రం పట్టించుకోలేదు. విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం సమూల మార్పులకు సిద్ధం కావడం ఎంతో మంచి పరిణామం.

– చొక్కాకుల సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు

క్లుప్తంగా

నేడు అడ్డాంలో 'గడప గడపకు'

కశింకోట : మండలంలోని అడ్డాం గ్రామంలో సోమవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను పంపిణీ చేసి, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తారన్నారు. అధికారులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

రేపు డైట్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

అనకాపల్లి టౌన్ : స్థానిక డైట్ కళాశాల ఏసీ ఆడిటోరియంలో ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేయడమైందన్నారు.

పోటీల పరీక్షలతో పోటీతత్వం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నాయుడు

అనకాపల్లిటౌన్ : పోటీల పరీక్షలు రాయడం ద్వారా పోటీతత్వం పెరుగుతుందని బాసర అకాడమీ డైరెక్టర్ నాయుడు అన్నారు. స్థానిక అకాడమిలో నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల ఆదివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటు వచ్చినా రాకపోయినా విద్యార్థులు ఇటువంటి పోటీ పరీక్షలకు హాజరుకావడం ద్వారా వారి సామర్థ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

బార్క్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



బార్క్ నిర్మాణ నేపథ్యంలో కోల్పోతున్న భూముల్ని చూపిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో చేపడుతున్న బార్క్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న తంతడి, రాజన్నపాలెం, దోసూరు, చిప్పాడ గ్రామస్తులకు ప్యాకేజీ అందజేయాలని సీపీఎం నాయకులు కె.సోమునాయుడు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ఆయా భూముల్ని పరిశీలించారు. ముందుగా చేసిన సర్వేలో 600 మంది లబ్ధిదారులు ఉండగా, 130 మంది నిర్వాసితులకు మాత్రమే పరిహారం అందిస్తామనడం సరి కాదన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్తిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బేదురులంక 2012	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్ 19 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 207 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

లక్ష్యానికి చేరువగా జగనన్న ఇళ్లు

- 44 శాతం పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు
- మిగిలినవి వివిధ దశల్లో...
- విశాలమైన లేవుట్లలో గృహ నిర్మాణాలు



చాలా వరకు పూర్తయిన గృహాలు



విశాలమైన లేన్లలో గృహాల నిర్మాణం

కశింకోట: మండలంలోని వైఎస్సార్ జగనన్న లే-అవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతంగా లక్ష్యానికి చేరువలో సాగుతున్నాయి. 44 శాతం మేర ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశలో ఉన్నాయి. వీటిని పూర్తి చేయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో వైఎస్సార్ జగనన్న పేదల గృహ నిర్మాణ పథకంలో ప్రభుత్వ ఇచ్చిన స్థలాలు, సొంత స్థలాల్లో 2071 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికి 914 ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యాయి. ఈ నెలాఖరుకు 922 ఇళ్లు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ మేరకు లక్ష్యంలో 8 ఇళ్లు వినా మిగిలినవి పూర్తి అయినట్టు అధికారిక సమాచారం. ఇక మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. శ్లాబ్ స్థాయిలో 413, రూఫ్ లెవెల్‌లో 122, బేస్‌మెంట్‌లో 570, రూఫ్‌నకు చేరువలో 59 ఇళ్లు వంతున ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

కశింకోటలో అధిక ఇళ్ల నిర్మాణం

కశింకోటలోని నాలుగు లే-అవుట్లలో అధిక ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వడ్డి వీధిలోని మెగా లే-అవుట్ సహా కోట దిబ్బ, గాడి వీధి, సత్తెమ్మ కాలనీల్లోని లే-అవుట్లలో 541 ఇళ్లలో సగానికి పైగా 339 ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. ఇది మండలంలో అత్యధికం. ఇక తర్వాత తేగాడలోని 5 గ్రామాల (తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాల పాలెం, శివారు జోగారావుపేట) లబ్ధిదారులకు నిర్మిస్తున్న పెద్ద లే-అవుట్‌లో 163 ఇళ్లకు 68 పూర్తి అయ్యాయి. తీడలో 131 ఇళ్లకు 47, జి. భీమవరంలో 47కు 27, నూతలగుంటపాలెంలో 110కి 50, ఎఎస్ పేటలో 83కు 28, బయ్యవరంలో 79కి 34, గొబ్బూరులో 63కి 39, ఈ.చౌడువాడలో 114కు 34 ఇళ్లు వంతున పూర్తయ్యాయి. మిగిలిన తాళ్లపాలెం, జమాదులపాలెం, వెదురుపర్తి, తదితర లే-అవుట్లలో కూడా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులు ఉత్సాహవంతంగా నిర్మాణాలు సాగిస్తూ సొంతింటి కల నేర వేర్చుకుంటున్నారు. ఇప్పటికే కాలనీల్లో విద్యుత్ సదుపాయం కల్పించారు. వీధి లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు వాటిలో కుటుంబాలతో నివాసం ఉంటూ ఆనందంగా జీవనం సాగిస్తున్నారు.

టాయిలెట్లకు అదనంగా రూ.12 వేలు

ఇంటి నిర్మాణంతోపాటు మరుగుదొడ్డి నిర్మించుకున్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.12 వేలు అదనంగా ఇవ్వనున్నారు. ఈ మేరకు వీటిని నిర్మించుకున్న 54 మందికి రెండు విడతలుగా చెల్లింపులు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడత రూ.5 వేలు, రెండో విడతగా రూ.7 వేలు ఇవ్వనున్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు



మాకు సొంతిల్లు లేదు. అద్దె ఇంటిలో ఉండేవారం. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇళ్ల స్థలం, ఇల్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేర్చారు. కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించారు. వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

-తమరాన వరలక్ష్మి, కశింకోట

అద్దె ఇంటి తిప్పలు తప్పాయి



15 ఏళ్లగా అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాయి. చిరు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకు వచ్చే తాము నెలకు రూ.5 వేల అద్దె చెల్లించాల్సి రావడం పెను భారంగా పరిణమించేది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. దీంతో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాం. అద్దె చెల్లింపు బాధ తప్పినందుకు, సొంతిల్లు సమకూరినందుకు ఆనందంగా ఉంది.

-కర్రి పైడితల్లమ్మ, కశింకోట.

914 ఇళ్లు పూర్తి

మండలంలో వైఎస్సార్ జగనన్న లే-అవుట్లు, సొంత స్థలాల్లో 2071 ఇళ్లు మంజూరు అయ్యాయి. వీటిలో 914 ఇళ్లు పూర్తి అయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మండలంలో ఈ నెలాఖరుకు 922 ఇళ్లు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. అధికారుల సహకారంతో లక్ష్యాన్ని చేరువ కావడానికి కృషి చేస్తున్నాం. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల్లో టాయిలెట్ నిర్మించుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.12 వేలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు చేపడతాం.

-వి. శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ, కశింకోట

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు

- సంక్షేమ పాలనపై అన్ని వర్గాల్లో సంతృప్తి
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- బీఆర్‌టీ, రామభద్రపురం కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో ఉన్న బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్ : ప్రతి కుటుంబానికి మేలు చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. మండలంలోని బీఆర్‌టీ, రామభద్రపురం కాలనీల్లో ఆదివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రతి ఇంటి వద్ద ప్రజలకు వివరిస్తూ సంక్షేమ లబ్ధి వివరాల బుక్‌లెట్‌లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో మంత్రి అమర్‌నాథ్ వివరించారు. పథకాలపై లబ్ధిదారులంతా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామాలన్నీ ప్రగతి పథంలో నడుస్తున్నాయని, గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తెస్తున్న సమస్యలు పరిష్కరించడానికి వీలు కలుగుతోందన్నారు. గ్రామాల్లో కనీస వసతుల కల్పనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వాలేవీ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. అనుక్షణం ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలంతా మద్దతునిచ్చి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిపక్షాలు తమ ప్రభుత్వంపై ఆధారాలు లేని విమర్శలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మరన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ఆదేశం

కొందరు స్థానికులు తమ వ్యక్తిగత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌టీ కాలనీలో అంతర్గత డ్రెయిన్లు లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు తెలిపారు. ప్రస్తుతం కాలనీలో ప్రధాన డ్రెయిన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తి కాగానే అంతర్గత కాల్వల నిర్మాణం చేపడతామని మంత్రి వారికి భరోసా కల్పించారు. రామభద్రపురంలో కూడా స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు చెప్పారు. అంతకుముందు గ్రామానికొచ్చిన మంత్రి అమర్‌నాథ్‌కు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పిసినికాడ ఎంపీటీసీ మొల్లేటి హైమ, సర్పంచ్ యల్లపు రమేష్, మొల్లేటి శివాజీ, మాజీ సర్పంచ్ రాము, బుద్ధ నాగేశ్వరరావు, శ్రీను, కోటి, పెద్దిశెట్టి రమేష్, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, డీఆర్‌డీఏ ఏపీఎం కె.నీలాచలం, పలువురు అధికారులు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కార్యక్రమంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక విజయా రెసిడెన్సీలో సంఘ వ్యవస్థాపకుడు రమణబాబు అధ్యక్షతన ఆదివారం ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీ నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన బీసీ వర్గాలకు సమన్యాయం చేసేందుకు సంఘ సభ్యులు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని సూచించారు. అంతకుముందు సంఘ గౌరవ సలహాదారులుగా సీహెచ్.మహేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా లొడగల శ్రీదేవి, యూత్ కమిటీ మెంబర్లుగా మాసవరపు అప్పారావు, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అనుపమ, విశాఖ జిల్లా కోశాధికారిగా యలమంచిలి ప్రసాద్, పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షునిగా ఇరుసువరపు వెంకటరావు, నియోజకవర్గ, పట్టణ కమిటీ మెంబర్‌గా బండారు శ్రావణ్‌కుమార్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శంకర్, ఉత్తరాంధ్ర జిల్లాల మహిళా విభాగం సభ్యురాలు కె.ఉమామహేశ్వరి, వాడచీపురుపల్లి అధ్యక్షుడు మాసవరపు వెంకయ్య నాయుడు, సభ్యులు పోలమరశెట్టి రామకృష్ణ, సన్నాడ జగ్గ అప్పారావు, ఎస్.శ్రీను, నాగులాపల్లి వెంకటేష్, నాగరాజు, యలమంచిలి ప్రసాద్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



గరగల ఊరేగింపును ప్రారంభిస్తున్న సీఐ మోహనరావు

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అన్నారు. స్థానిక కోట్నివీధి మరిడిమాంబ గరగల ఊరేగింపును ఆయన ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు ఖాళీ సమయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. 84వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ నేత కోరుకొండ రాఘవ మాట్లాడుతూ ఈనెల 31న అమ్మవారి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కోట్ని శ్రీనివాసరావు వెంకట పద్మ, కుమారులు యశ్వంత్ సాయి, పెద్దేటి యమున ఆర్థిక సహకారంతో అమ్మవారి రథయాత్ర కూడా నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ అప్పికొండ రవిశంకర్, రాఘవ మిత్ర మండలి సభ్యులు తలారి లక్ష్మీప్రసాద్, కోరుకొండ వాసు, సీతారామరాజు, కె.నాగరాజు, లకిడపు స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



సాయివెంగమాంబ స్టోన్‌క్రషర్‌లో మొక్క నాటుతున్న సుబ్బారాయుడు

అనకాపల్లిటౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని గనులశాఖ ఉప సంచాలకులు సుబ్బారాయుడు అన్నారు. మండలంలో బవులవాడ పంచాయతీ పరిధిలో సాయి వెంగమాంబ స్టోన్‌క్రషర్‌లో యజమాని ఆదిశేషయ్య, అమిత్‌కుమార్ కలిసి ఆయన ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అలాగే వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం... ఆరోగ్యంగా ఉందాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రషర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంత జీవన విధానం



ప్రజలకు గొడుగులు అందజేస్తున్న న్యాయమూర్తి శివకిరణ్

అనకాపల్లిటౌన్ : ధ్యానం ద్వారా ప్రశాంతమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని థర్డ్ అడిషనల్ సివిల్‌జడ్జి ఎం.శివకిరణ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్రా మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రం ఆదివారం ఆయన గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా వల్ల ఒక్కరిలో ఆలోచనా విధానం మెరుగుపడుతుందన్నారు. ఈ ఆలోచనా విధానం ద్వారా భార్యాభర్తల మధ్య మంచి అవగాహన ఏర్పడుతుందని సూచించారు. స్నేహితులు, కుటుంబ బాంధవ్యాలు పెరుగుతాయన్నారు. ఇటువంటి ప్రశాంతమైన జీవన విధానం ద్వారా నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.చిట్టిబాబు, రాంబిల్లి డీటీ వి.శేషుబాబు, కేంద్రం కో ఆర్డినేటర్ కోలపర్తి జయబాబు, సభ్యులు కె.వి.కె.రావు, జి.మంగయ్య పాల్గొన్నారు.

రామకృష్ణ, సింహాద్రప్పడులకు ఘన నివాళి



వర్ధంతి కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించడంలో సింగంపల్లి రామకృష్ణ, గుళ్లిపల్లి సింహాద్రప్పుడు రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. స్థానిక ఏపీటీఎఫ్ భవనంలో ఆదివారం వారి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు రామకృష్ణ, సింహాద్రప్పుడు చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు కొణతాల గణేష్, అనురాధ, జమ్ములమ్మ, సరసయ్యానాయుడు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DIST. JUDGE R.R.DIST, AT: LB. NAGAR.
I.A.NO. 474 & 475 OF 2021 IN O.S.NO.363 OF 2009

BETWEEN:
Rayudu Sridevi & others ..Petitioners/Plaintiffs
AND
K. Ramakantham & 8 others .. Respondents/Defendants

To,
R3: Malla Krishna Kishore, S/o. Ramu Naidu, Aged 50 yrs, R/o. D.No. 16-2-33, Kota Veedhi, Anakapalli, Visakhapatnam.
R4: Kondregula Sanjeev Kumar, S/o. Rama Rao Aged 52 years, R/o. D. No: 10-85B, N.G.C. Colony, Kothur, Anakapalli, Visakhapatnam.
R5: Chollangi Alekya, D/o. Chollangi Rajashekar Aged 31 years, R/o: D. No: 36-92-242/35, Madhusudhana Nagar, Visakhapatnam.
R6: M/s Viswam Constructions a partnership firm having its office at B9/F2, 3RT, MIG quarters, Sanjeeva Reddy Nagar, Hyderabad-38. Rep by its Managing partner K.Visweswara Reddy, S/o. Ramanjaneya Reddy.
R7: K. Visweswara Reddy, S/o. K. Ramanjaneya Reddy, A/a: 49 Years, Editor & Managing partner of M/s. Viswam Constructions, R/o.H.No:5-3-469, Sri Krishna Nagar, Kukatpally, Hyderabad-72.

Please take notice that, whereas the Petitioners/ Plaintiffs has instituted the above suit for partition by metes and bounds and for separate possession of the Plaint Schedule Property claiming 1/5th share each. The petitioner / plaintiff filed two I.A.s one I.A No.474/2021 i.e., Order XX Rule 18 for Final Decree in terms of the preliminary decree dt: 23/12/2019 and another one is order XXV Rule 13 of C.P.C vide I.A.No: 475/2021 to appoint an Advocate Commissioner to partition the property by metes and bounds. You are hereby directed to appear before the Court on 11/9/2023 at 10:30 A.M. personally to answer the claims of the petitioner failing which the I.A.No.s 474 and 475 of 2021 in O.S. No. 363 of 2009 will be heard and decided in your absence in accordance with law.

(By order of the Hon'ble Court)
Sd/- K. Koteswara Rao,
G. Sreenivasa Reddy, Advocates,
Rock Town Colony, L.B.Nagar, Hyd.
Ph. 7659969696

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



గర్భిణులకు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సేవాసంస్థ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆదివారం స్వర్గీయ అప్పికొండ బాలకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలకృష్ణ స్నేహితులతో పాటు సేవా సంస్థ సభ్యులు రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి, సేవాసంస్థ సభ్యులు ఏసుబాబు, సారథి, భాను పాల్గొన్నారు.

400 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 262 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 97 మందికి మందులు అందజేశారు. 52 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 15 మంది రక్తాన్ని దానం చేశారు. ఆయా శిబిరాలకు విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయం కల్పించారు.

ప్రశ్నించే తత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలి

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి గంగరాజు



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

అనకాపల్లిటౌన్ : సంపూర్ణ విషయ పరిజ్ఞానంతో ప్రశ్నించేతత్వాన్ని ప్రజలు అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో మండల న్యాయసేవా అధికార సంస్థ, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమస్యనైనా రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, అందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. వివాదాల పరిష్కారానికి ప్రభావంతమైన సాధనం లోక్ అదాలత్ అని అభివర్ణించారు. అల్పాదాయవర్గాల ప్రజలకు లోక్ అదాలత్ ఉచిత న్యాయసహాయం చేస్తుందన్నారు. న్యాయస్థానం లేదా వ్యాజ్యానికి ముందు పెండింగ్ దశలో ఉన్న వివాదాలు/కేసులను సామరస్యంగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొని, రాజీ చేసుకునే అవకాశముందన్నారు. రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బి.వి.విజయలక్ష్మి, మూడో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.శివకిరణ్‌లు మాట్లాడుతూ సత్వర న్యాయానికి, న్యాయసహాయానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందరికీ అందుబాటులో న్యాయాన్ని ఉంచడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. అంతకుముందు న్యాయమూర్తులను గ్రంథాలయ సభ్యులు ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనశిక్షణాసంస్థాన్ డైరెక్టర్ చొక్కాకుల అప్పలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు, సభ్యులు బొడ్డేడ జగ్గ అప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ, టైలరింగ్ శిక్షకురాలు రాపేటి ప్రేమలత పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి పీఎం సహాయ నిధి



బాధితురాలు కాకి ఆదిలక్ష్మి కుటుంబసభ్యులకు చెక్కునందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : దేవరాపల్లి మండలం నేలబెల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్న కాకి ఆదిలక్ష్మికి ఎంపీ బి.వి.సత్యవతి తన కార్యాలయంలో ఆదివారం పీఎం సహాయ నిధిని అందజేశారు. బాధితురాలు గతంలో ఎంపీ సత్యవతిని సహాయం చేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు ఎంపీ స్పందించి పీఎం సహాయ నిధి ద్వారా రూ.3లక్షల చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

మునగపాక: ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారకులు ఆదారి గంగాధర్ కోరారు. మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తనతో పాటు భక్తి గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. రోజులో అరగంట పాటు వ్యాయామం చేయాలన్నారు. గ్రామంలోని భజన బృందాలను కలుపుకొని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చంద్ర మాలకొండయ్య, సిరియాల సత్యనారాయణ, సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ, కొణతాల వెంకటరావు, కర్రి వాసు పాల్గొన్నారు.

మల్లవరంలో క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మల్లవరం సర్పంచ్ హేమలత

మునగపాక : క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుఢ్యం పెరుగుతుందని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత పేర్కొన్నారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మల్ల వరం పంచాయతీ పరిధిలోని పిల్లలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన హేమలత మాట్లాడుతూ మల్లవరం పంచాయతీని ఎస్‌బీఐ ఫౌండేషన్ దత్తత తీసుకోవడం సంతోషకరమన్నారు క్రీడలను ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత ఇందల నాయుడు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.